క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెద్దిశెట్టిపల్లిలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పెద్దిశెట్టిపల్లి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు పెద్దిశెట్టిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో క్యాంపు ప్రారంభమవుతుందన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఉపాధ్యాయురాలు భారతి

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కరణం భారతికి యూఎస్ఏకి చెందిన కామన్‌వెల్త్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. చెన్నైలో గురువారం అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కళారంగం, విద్యారంగంలో విద్యార్థులను ప్రోత్సహించి వారిని ప్రతిభావంతులుగా తయారు చేయడంలో ఉపాధ్యాయురాలు భారతి కృషి చేశారు. దాంతోపాటు పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంగళవాణి మాసపత్రికకు ఎడిటర్‌గా సేవలం అందిస్తున్నారు. వారి సేవలను గుర్తించి నిర్వాహకులు భారతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు హెచ్ఎం సుజాత తెలిపారు. ఈ సందర్భంగా భారతిని ఉపాధ్యాయులు అభినందించారు.

అయోడిన్ లోప నివారణ దినోత్సవ ర్యాలీ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం గిరింపేటలోని మున్సిపల్ స్కూల్‌లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ ప్రారంభించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ సుదర్శన్, ఎపిడిమాలజిస్ట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ వివరాలు అందజేయండి



ఆర్‌బీకేలో అతికించిన ఈ–క్రాప్ వివరాల పోస్టర్లు

గుడిపాల: ఈ క్రాప్ నమోదు వివరాలను ప్రతి ఒక్క రైతుకూ తెలియజేయాలని వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. వసంతాపురం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఈ క్రాప్ వివరాలను రైతులతో సమావేశం నిర్వహించి ఆమె తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ సున్నావడ్డీ రుణాలు, బ్యాంకు రుణాలు, పంట నష్టపోయి నట్లయితే బీమా పరిహారం రైతులకు రావాలంటే తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు రైతులు చేసుకోవాలన్నారు. వసంతాపురం రైతు భరోసా కేంద్రం పరిధిలో 160 మంది రైతులు 320 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేసినట్లు ఆమె తెలియజేశారు. ఆమెతోపాటు ఎంపీహెచ్ఓ సోనియా రైతులు పాల్గొన్నారు.

ఆయుధపూజ

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. యంత్రాలకు డీఈ ఆనంద్, ఏఈ మోహన్‌శెట్టి పూజలు చేశారు. అదే విధంగా మిట్టూరు సెక్షన్ ఎంఎస్ఆర్ సర్కిల్లో ఆయుధ పూజ నిర్వహించారు. ఏఈ రాజేంద్రబాబు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ఐరాల: మండలంలోని ఇరువారంపల్లె రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఎఫ్‌పీఓ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడీఏ మధుసూదన్‌రెడ్డి రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ భీమనేనివారిపల్లె, ఇరువారంపల్లె, మొరంపల్లె పంచాయతీలకు చెందిన రైతులకు వర్షాధార ప్రాంత అభివృద్ధి(ఆర్ఏడీ) పథకం ద్వారా చిరుధాన్యాలు ప్రాసెసింగ్ యూనిట్‌ను వ్యవసాయ శాఖ తరఫున రైతులకు 50 శాతం రాయితీతో అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్ఏడీ పథకం ద్వారా రైతులకు అందజేసే పరికరాల ఉపయోగాలు, ధరల గురించి వివరించారు. వరి సాగులో సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) వ్యవసాయ శాఖాధికారి పద్మజ అన్నారు. వరిలో చీడ, పీడల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ మధుసూదన్‌రెడ్డి

మృత్యుదారులు



పూతలపట్టు - నాయుడు పేట రహదారిపై ప్రమాదం (ఫైల్)

దారి కాసిన మృత్యువు వికటాట్టహాసం చేస్తోంది. వరుసగా ప్రాణాలను కబళిస్తోంది. పూతపలపట్టు పరిధిలోని జాతీయ రహదారులపై మృత్యుఘోష మిన్నంటుతోంది. విహారయాత్రలు, ఇతరత్రా పనుల మీద వెళ్లే వాహనచోదకుల ప్రాణాలు క్షణాల్లో గాల్లో కలిసిపోతున్నాయి. కొందరు సంఘటన స్థలంలోనే మృతి చెందగా, మరికొందరు క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇందుకు అతివేగమే ప్రమాదాలకు కారణమంటున్నారు. ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

- పూతలపట్టు మండలంలో జాతీయ రహదారిపై రక్తపుటేరులు
- గాల్లో కలిసిపోతున్న వందలాదిప్రాణాలు
- నుజ్జునుజ్జవుతున్న వాహనాలు
- ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు

పూతలపట్టు: మండలం మీదుగా రెండు జాతీయ రహదారులు ఎన్‌హెచ్40, ఎన్‌హెచ్140 వెళుతున్నాయి. ఈ మార్గంలోనే కర్ణాటక, తమిళనాడుకు వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తిరుపతి, తిరుమలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. చిత్తూరు పరిసర ప్రాంతాల నుంచి తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడకు వెళ్లే వారు ఈ మార్గాలనే ఎంచుకుంటారు. ప్రధానంగా సరుకు రవాణా చేసే భారీ వాహనాలు సకాలంలో గమ్యాన్ని చేరుకోవాలన్న తపనతో అతి వేగంతో దూసుకుపోతుంటాయి. ఈ తరుణంలో పలు వాహనాలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎక్కువగా కారులో వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. తర్వాత ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. బెంగుళూరు–రంగంపేట మార్గంలో పాలకూరు గ్రామ సమీపంలో ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. చిత్తూరు–పి.కొత్తకోట మార్గంలో బండపల్లి, రంగంపేట క్రాస్, వేపనపల్లి రోడ్డు, పి.కొత్తకోట ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వేకువజాము 3 నుంచి ఉదయం 7 గంటలు, రాత్రి 8 నుంచి 11.30 గంటల మధ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని అధికారుల రికార్డుల్లోకి ఎక్కాయి. తిరుపతి నుంచి చిత్తూరు, బెంగుళూరుకు వెళ్లే వాహనాలే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నట్లు గుర్తించారు. ఈ ప్రమాదాలకు అతివేగమే ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. తర్వాత వేకువజామున జరిగే ప్రమాదాలన్నీ అదుపు తప్పి జరిగినవేనని పోలీసుల రికార్డులు చెబుతున్నాయి ఈ తరుణంలో ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోంది. ఆ ప్రాంతంలో సూచికబోర్డులు ఏర్పాటు చేస్తోంది. వాహనదారులకు అవగాహన కల్పిస్తోంది.

- కర్ణాటక శివాజీనగర్ పోలీసు బృందానికి చెందిన ఇద్దరు ఎస్ఐలు, ఒక ఏఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లు, ఒక డ్రైవర్ మొత్తం 8 మంది కలిసి ఒక కేసు దర్యాప్తు కోసం గతేడాది జూలై 25న విజయనగరానికి బయలుదేరారు. చిత్తూరుకు చేరుకునేలోపే ఆ ప్రయాణం అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఒక వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట పరిధిలో రైల్వే బ్రిడ్జి వద్దకు రాగానే పక్కన మరమ్మత్తులు చేస్తున్న రహదారిపై వెళ్లి బ్రిడ్జిని ఢీకొనడంతో కారులోని ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, డ్రైవరు మృతి చెందగా మిగిలిన వారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.
- ఐరాల మండలానికి చెందిన యువకుడికి పూతలపట్టు లక్ష్మయ్యవూరుకు చెందిన యువతికి పెద్దల సమక్షంలో పెళ్లికుదిరింది. గతేడాది డిసెంబర్ 8వతేదీన పెళ్లి ముహూర్తం పెట్టారు. వరుడు, బంధువులు, గ్రామస్తులు ట్రాక్టర్‌లో ముందు రోజు రాత్రి ఆ యువతి ఇంటి వద్దకు బయలుదేరారు. జెట్టిపల్లి వద్దకు రాగానే ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురు మృతి చెందారు. 22 మంది తీవ్రగాయాలయ్యారు.
- ప్రకాశం జిల్లాకు చెందిన ఓ కుటుంబం గుంటూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా, 2023 మార్చి15న పూతలపట్టు మండలం పాలకూరు వద్ద కారు వేగంగా దూసుకెళ్లి ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో తల్లి, కూతురు మృతి చెందడంతో, మామ అల్లుడు తీవ్ర గాయాలపాలయ్యారు.
- బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం తిరుమల దర్శనం చేసుకుని వారి స్వస్థలానికి తిరుగుపయనమయ్యారు. ఈ ఏడాది మే 12న పూతలపట్టు మండలం పాలకూరు వద్ద ఎదురువెళ్తున్న లారీని ఢీ కొనడంతో ఒక యువతి అక్కడికక్కడే మృతి చెందింది. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.



కొత్తకోట వద్ద ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు (ఫైల్)

ప్రమాదాల కట్టడికి చర్యలు



రోడ్డు ప్రమాద సంఘటన స్థలికి చేరుకుని ఎప్పటికప్పుడు ప్రమాద కారణలపై ఆరా తీస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో సూచికలు బోర్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా యువతకు అవగాహన కల్పిస్తున్నాం. అతివేగం వద్దని హెచ్చరిస్తున్నాం. జరిగిన ప్రమాదాల్లో అధికశాతం మంది దూరపు ప్రయాణం చేసే వాళ్లే. అదుపు తప్పి జరిగిన ప్రమాదాలూ ఎక్కువే. జాగ్రతతో వాహనం నడపడం అన్ని విధాలా శ్రేయస్కరం.

–సురేష్, ఎస్ఐ, పూతలపట్టు

వేణుగోపాలస్వామి ఆలయ కుంభాభిషేకం





కుంభాభిషేకంలో విజయానందరెడ్డి, కలశాలను తీసుకెళుతున్న వేదపండితులు

గుడిపాల: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ కుంభాభిషేకం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు యాత్ర దాన సంకల్పం, రెండో కాల యాగశాల, 10 గంటలకు మహా పూర్ణాహుతి, మహా గణపతి, రుక్మిణి సత్యభామ వేణుగోపాల స్వాములకు వేద పండితుల మధ్య మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు. కుంభాభిషేకంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డికి స్వామి వారిని దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు రజనీకాంత్, పెరిల్లాలు స్వామిని దర్శించుకొని వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. రాత్రి స్వామివారిని బాణసంచా, వాయిద్య బృందంచే ఊరేగించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బంగారుపాళెం: సాఫ్ట్‌బాల్ పోటీల్లో మండలంలోని ఎగువరాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నట్లు హెచ్ఎం సుజాత తెలిపారు. పుత్తూరు ఎస్ఆర్ఎస్ హైస్కూల్ ఆవరణలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–17, అండర్–19 బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో చరిష్మా, త్రిషా, బాలుర విభాగంలో దినేష్, భరత్, అండర్–19 బాలికల విభాగంలో నందిని, అక్షయ, కీర్తన, బాలుర విభాగంలో సందీప్ సత్తాచాటి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు దశరథను శుక్రవారం హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.



జిల్లా సాఫ్ట్‌బాల్ జట్లకు ఎంపికైన విద్యార్థులు

రైఫిల్ షూటింగ్‌కు 54 మంది విద్యార్థులు

తిరుపతి కల్చరల్: జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభతో 54 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్పీజేఎస్ఎం స్కూల్లో శుక్రవారం అండర్–14, 17, 19 విభాగాలలో జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ –14 విభాగంలో 18 మంది, అండర్–17 విభాగంలో 18 మంది, అండర్ –19 విభాగంలో 18 మంది మొత్తం 54 మంది ఎంపికైనట్లు ఫెడరేషన్ కార్యదర్శి పి.విజయకుమారి తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ఎంపికైన వారు ఈనెల 28, 29, 30వ తేదీలలో రాజమండ్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రైఫిల్ షూటింగ్‌కు ఎంపికైన వారిలో మారుతీనగర్, కొర్లగుంట శ్రీవారి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి బి.యశ్వంత్ కృష్ణ ఉన్నారు. టీమ్ మేనేజర్ కె.సుధ, స్కూల్ ప్రిన్సిపల్ బాలక్రిష్ణయ్య, పీఈటీ శివ, యాజమాన్యం,వి ద్యార్థులకు పది రోజులపాటు కోచింగ్ ఇచ్చి తీర్చిదిద్దిన వారిని జాతీయ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ కార్యదర్శి దేవరాజు అభినందలు తెలియజేశారు.

జగనన్న సురక్ష.. ఆరోగ్యానికి శ్రీరామరక్ష

చిత్తూరు అర్బన్: ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తోందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఈ కార్యక్రమం పేదలకు వరం లాంటిదన్నారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని మిట్టూరులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ ఎస్.అముద, కమిషనర్ అరుణ పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, మెరుగైన చికిత్స అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో భాగంగా నిపుణులైన వైద్యుల ద్వారా వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో ఏర్పాటుచేసిన విభాగాలను పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, అధికారులకు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మురళీకృష్ణ, ఉన్నికృష్ణ, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, మెప్మా సీఎంఎం గోపి, వైద్యాధికారులు, వార్డు కార్యదర్శి, వలంటీర్లు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ తదితరులు

340 మందికి ఆరోగ్య పరీక్షలు

బంగారుపాళెం: మండలంలోని నల్లంగాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 340 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ లోకేష్ తెలిపారు. వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ ధనంజయరావు, ఎంపీటీసీ ఉషశ్రీ ప్రారంభించారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ పాలాక్షిరెడ్డి, డాక్టర్లు, వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ కార్యదర్శి ఎల్లప్ప, సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

గుడిపాల: జనం వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, మెరుగైన వైద్యం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పానాటూరు సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష స్థానిక సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవలను వివరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 5లక్షల వరకు కార్పొరేట్, జిల్లా ఆస్పత్రుల్లో అందే సేవలపై తెలియజేశారు. అనంతరం వైద్యులు అనూష, హరి, రష్మిత 361 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.





బంగారుపాళెం: నల్లంగాడు వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది, జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి

బీఎంసీ పనుల పరిశీలన

పూతలపట్టు: మండలంలో పోలవరంలో నిర్మించిన పాలశీతలీకరణ (బల్క్ మిల్క్ సెంటర్) భవనాన్ని శుక్రవారం పీఆర్‌డీఈ మహేష్‌కుమార్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని సూచించారు. పాలశీతలీకరణ కేంద్రానికి కావలసిన యంత్రాలు రెండు రోజుల్లో వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్ఎంకి తీవ్ర గాయాలు

పూతలపట్టు: ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఏఎల్ఎంకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, చిత్తూరు చెందిన శేఖర్ మండలంలోని చిటిపిరాళ్ల పంచాయతీ పరిధిలోని సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం కొత్తకోట సమీపంలో కరెంటు స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. వెంటనే సహచర సిబ్బంది చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సిఫార్సు మేరకు వేలూరు సీఎంసీకి తరలించారు.

బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు చేశారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేపాకు, పూలతోరణాలతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటల నుంచి 12 మధ్యలో రాహుకాల అభిషేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం వద్ద రద్దీ నెలకొంది. అధికారులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎస్ఐ రవికుమార్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

అమృత సరోవర్ కుంటలతో జలవృద్ధి





తవణంపల్లె: నీటి నిల్వ కుంటను పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ బృందం, **యాదమరి:** కానాపల్లెలో పనులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

యాదమరి: ఉపాధి హామీలో గ్రామాల్లో అమృత సరోవర్ కుంటలు ఏర్పాటు చేయడంతో జలవృద్ధి అవుతుందని కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ బృందం నోడల్ ఆఫీసర్ సచీంద్ర కుమార్ పట్నాయక్ తెలిపారు. మండలంలోని బుడితరెడ్డి పల్లె పంచాయతీలో శుక్రవారం ఉపాధిహామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన అమృత్ సరోవర్ కుంట, కొనాపల్లె పంచాయతీలో జంగిల్ క్లియరెన్స్ పనులను వారు పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వారు రైతులతో మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకంలో నిర్మించిన నీటితో భూగర్భ జలాలు పెరుగుతాయని, వ్యవసాయ బావులు, బోరు బావుల్లో నీరు వృద్ధి అవుతుందన్నారు.

రైతులకు ఉపయోగకరం

తవణంపల్లె: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులతో నిర్మించిన నీటి కుంటలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా బాగున్నాయని, కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ బృందం తెలిపింది. స్థానిక సచివాలయం వద్ద శుక్రవారం ఉపాధి నిధులు రూ.60 లక్షలతో నిర్మించిన ఇంకుడు గుంతలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఇంకుడు గుంతలో వర్షం నీరు వృథాగా పోకుండా భూగర్భజలాలు పెంపొందించడానికి ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం తవణంపల్లెకు చెందిన రైతు మురుగేష్ శెట్టి పొలంలో ఏర్పాటు చేసిన నీటి నిల్వ కుంటను పరిశీలించారు. నీటి నిల్వ కుంట వల్ల ప్రయోజనాలను రైతును అడిగి తెలుసుకొన్నారు. ఉపాధి నిధులతో చేపడుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ శాస్త్రవేత్త సోమేంద్ర సింగ్, కమిటీ నోడల్ ఆఫీసర్ సచింద్రకుమార్ పట్నాయక్, డ్వామా పీడీ గంగాభవాని, ఏపీడీ సునీల్, సుబ్రమణ్యం, ఉమాదేవి, ఏపీఓ లలిత, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన ఉద్యోగులకు అభినందన

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల చెన్నైలో ట్రాన్స్‌కో ఉద్యోగులకు నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో చిత్తూరు డివిజన్ పరంగా పలువురు ఉద్యోగులు ప్రతిభ చూపారు. వీరిని శుక్రవారం డివిజన్ కార్యాలయంలో ఈఈ పద్మనాభపిళ్లై అభినందించి సన్మానించారు. జాతీయ స్థాయి టెన్నికాయిట్‌లో పెనుమూరు సెక్షన్ ఏఈ నీరజ 2వ స్థానం, హాకీలో పాలసముద్రం సెక్షన్ ఎల్ఐ వినోద్‌రాజు 3వ స్థానం సాధించారు. హాకీలో నిర్మాణ విభాగం ఎల్ఐ జబనేషన్, జీడీనెల్లూరు ఎఎల్ఎం భాస్కర్‌రెడ్డి, విద్యుత్ రెవెన్యూ అధికారి భాగ్యశేఖర్ కలిసి ఆడిన టీమ్ రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి సాధించింది. పోటీల్లో 9 రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. విజేతలకు జ్ఞాపికలను అందజేసి ఈఈ మాట్లాడారు. పని ఒత్తిడి నుంచి క్రీడలు ఆటవిడుపుగా పనిచేస్తుందన్నారు. డివిజన్ పరంగా ఉద్యోగులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ఆడి మంచి పేరు తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఈఈలు శేషాద్రి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు అభినందనలు తెలుపుతున్న ఈఈ పద్మనాభ పిళ్లై